
కథ

# ఫెన్సింగ్

- వి.నాగరత్న





లత జడేసుకుని మల్లెపూలు పెట్టుకుంటూండగా ఫోన్ మోగింది. డిస్ప్లే అయిన పేరు చూసింది. అతనే. ఒకింత ఆనందం. మరింత ఆందోళనా ఒక్కసారిగా ఆవరించాయి. కలతచెందిన స్వరంతో 'హలో' అంది.

''ఆ... ఏం చేస్తున్నావ్?'' అన్నాడు చాలా క్యాజువల్‌గా.

''పూలు పెట్టుకుంటున్నాను'' అనబోయి అందుకు మరేదో అలజడి రేపే డైలాగ్ వినాల్సొస్తుందని జడ సంగతి మాత్రమే చెప్పింది.

''ఎందుకు నన్నింత సతాయిస్తున్నావ్?'' అన్నాడు. అతడి గొంతు అదోకలాంటి మైకం గొని మత్తుగా వుంది.

''ఇది మరీ బాగుంది. నువ్వు విసిగిస్తూ పైగా నా మీద నేరం మోపడమా?''

''నువ్వసలు ఎందుకు పరిచయమయ్యావ్?''

లత ఏమీ మాట్లాడలేదు.

''ప్లీజ్ లతా, నువ్వు నాక్కావాలి''

లతకి చాలా ఇబ్బందిగా వుంది. ఈ మాటలు వినివినీ మైండ్‌లో రికార్డయిపోయాయి. చిన్న చిన్న పదాల తేడాలు తప్పిస్తే అదే భావం.

''ప్రపంచంలో ఎన్ని విషయాల్లేవు? ఈ చెత్తక్కొటీ తప్పించి ఇంకేమైనా మాట్లాడరాదూ?''

''లేదు, నాకు తక్కిందంతా నాన్సెన్స్. నువ్వు నాక్కావాలి. అందుకు నేనేం చేయాలో చెప్పు.''

''ఇలాంటి మాటలొద్దు. ఇంకేమైనా మాట్లాడ్తే సంతోషిస్తాను.''

''నేను తలుచుకుంటే ఎందరాడపిల్లలైనా వస్తారు. కానీ అదేంటో నాకు నీ మీదే....''

''ఇది చాలా అన్యాయం. నన్నిలా డిస్టర్బ్ చేయడం ఏం బాలేదు.''

''నాకూ తెలుస్తోంది. నిన్ను ఇబ్బంది పెట్టొద్దని ఎంత అనుకున్నా నీకు ఫోన్ చేయకుండా వుండలేకపోతున్నా. ఇద్దరం టీనేజ్‌లో లేం నిజమే. కానీ ఈ వయసులో కూడా ఇంత బలమైన ప్రేమ వుంటుందని నాకు ఇప్పుడే తెలిసింది.

''గాడిదగుడ్డు. ప్రేమ అదసలు ప్రపంచంలోనే లేదు.''

''నీలో ఇంత నిరాశ ఎందుకొచ్చింది? నాకు నీమీద కలిగిన దాన్ని ప్రేమ అనక ఏమంటారు? అస్తమానం నీతో మాట్లాడాలనిపిస్తుంది. నువ్వు నా పక్కన వుంటే బాగుండనిపిస్తుంది.''

''తొక్కలో ప్రేమ. అసలా మాటంటేనే నాకు పరమ చిరాకు. ప్రపంచంలో తల్లీపిల్లల మధ్య తప్ప తక్కిన ఏ రిలేషన్‌లోనూ స్వార్థం తప్ప ఇంకోటి లేదు.''

''నీకెదురైన ఎక్స్‌పీరియన్స్‌ని బట్టి అన్నీ అలానే వుంటాయని ఎందుకు అనలైజ్ చేస్తావ్? నువ్వు నమ్మినా, నమ్మకపోయినా, నాకు నువ్వంటే నిజంగా ఇష్టం. మాటల్లో చెప్పలేనంత ఇష్టం. పెళ్లయినవాడ్ని. స్త్రీ, పురుషుల మధ్య ఏముంటుందో తెలిసిన వాడ్ని. ఇక అంతకంటే ఏమీ వుండదని తెలుసు. కానీ అదేం చిత్రమో తెలీదు. ఈ వయసులో నీమీద ఇంత వ్యామోహం పుట్టుకొచ్చింది. నా మనసు నిన్ను గట్టిగా కోరుకుంటోంది'' అన్నాడు.

''నేను ఫోన్ పెట్టేస్తున్నాను'' అనేసి ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది లత. కానీ గుండె అదురు తగ్గలేదు. ముఖమంతా వెచ్చటి ఆవిర్లు పరుచుకున్నాయి. 'ఏమిటీ మాయ' అనుకుంది. తిందామనుకున్నా తిండి మానేసి హడావిడిగా ఆఫీసుకు బయల్దేరింది. తనలో ఇంకా ఆకర్షణ వుందా? అని ఆశ్చర్యం. అది సిన్సియర్ ప్రేమేనా అని సందేహం. ఆ మాటల్లో కనిపిస్తున్న ఆర్ద్రత చూస్తే ఆనందం. తన ప్రమేయం లేకుండా, తననుంచి ఏమీ ఆశించకుండా ఇష్టపడుతున్నాడా అని సంతోషం. ఒక వ్యక్తిని ఇంతగా ఆకట్టుకున్నానా? అని ఒకింత గర్వం. ఇది ఎక్కడికి దారి తీస్తుందోనని విపరీతమైన భయం.

ఇతనింత ప్రేమ ఒలికిస్తున్నాడే. ఒకవేళ తన భర్త స్పీకర్ ఆన్‌చేసి వింటే ఎలా వుంటుంది? ఛ...ఛ... తన మీద తనకే రోత కలిగింది. తనేమైనా అతిగా చనువిచ్చిందా? లేదు. ఇదివరకెన్నిసార్లో సమీక్షించుకుంది. సంపూర్ణంగా క్రాస్ చెక్ చేసుకుంది. తానెక్కడా తప్పుగా ప్రవర్తించలేదు. మాటల్లో హద్దు మీరుతున్నాడని తెలీగానే అతనికి దూరమవ్వాలనుకుంది. అయితే అతను తనకి చేసిన సాయం గుర్తుచేసుకొని అంతగా హర్ట్ చేయలేకపోయింది. కాని మొహమాటానికి పోతే కడుపొతుందని నానమ్మ చెప్పిన మొరటు సామెత తనకి గుర్తొస్తూ కొరడాదెబ్బలా, తగుల్తూనే వుంది. అతను వ్యక్తిగా మంచివాడు. అంత వరకూ ఖచ్చితం. తనను ఇష్టపడ్డాడు. ఇష్టపడి దగ్గరవ్వాలనుకుంటున్నాడు.

ఇదా మంచితనం? బలవంతపెట్టక పోయినంతలో, బ్లాక్‌మెయిలింగ్ చేయనంతలో మంచివాళ్లా? పెళ్లయినవాడు, వివాహితను మోహించడం న్యాయమా? ఇది ఎంత వెగటుగా, వికారంగా వుంది? అతడు తనను ఇష్టపడుతున్నానని చెప్పినట్లే ఇంకో మగాడు అతని భార్యతో చెప్తే తట్టుకోగలడా? అబ్బే, ఛస్తే జీర్ణించుకోలేడు. అతనే కాదు ప్రపంచంలో ఏ పురుషుడూ తన భార్య వైపు ఇంకో మగాడు కన్నెత్తి చూడ్డం కూడా భరించలేడు. కానీ వాళ్లు మటుకు ఏ స్త్రీనైనా కామించగలరు. మోహించగలరు. ప్రేమించగలరు. ఆఖరికి సంబంధం కూడా పెట్టుకోగలరు.

లత ఆలోచన్లు అంతూదరీ లేకుండా సాగిపోతూనే వున్నాయి. కండక్టర్ 'చర్మాస్' అని అరవగానే ఉలిక్కిపడి లేచి బస్సు దిగడానికి ఉరికింది.

* * *

ఆఫీసరడిగిన ఏదో ఫైల్ కోసం కంప్యూటర్లో సెర్చ్ నొక్కింది. అవసరమైన ఫైల్ 'డి' డ్రైవ్‌లో దొరగ్గా రెండు ప్రింటిచ్చింది. ప్రింటర్ దగ్గరకెళ్లి వాటిని తీసుకొని ఆఫీసర్ క్యాబిన్‌కెళ్తే ఆయన సీట్లో లేరు. సరేనని టేబుల్ మీద పెట్టేసి వచ్చేసరికి మూడు మిస్‌డ్ కాల్సున్నాయి. రెండు అతన్నుంచి వచ్చినకాల్స్ కాగా మరొకటి వాణి నుంచి వచ్చింది. మది నిండా విసుగూ, చిరాకు. ఎవరికీ ఫోన్ చేయాలనిపించలేదు.

అతను మళ్లీ చేసి ''ఏంటి? ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయవు?'' అన్నాడు.

''నేను సీట్లో లేను'' అంది.

''తెగ గుర్తొస్తున్నావ్ లతా, ఒక్కసారి దగ్గరకి తీసుకొని గట్టిగా..''

''ప్చ్... అలా మాట్లాడొద్దు. మీటింగ్ వుందట. బాస్ పిలుస్తున్నాడు. నే వెళుతున్నా'' అనేసి ఫోన్ డిస్‌కనెక్ట్ చేసింది. వెంటనే స్విచ్ఛాఫ్ కూడా చేసింది. కానీ లతకి ఏమో అయిపోయింది. నిజంగా అతను దగ్గరకి తీసుకొన్నట్లు అనిపించి తుళ్లిపడింది. ముచ్చెమట్లు పోశాయ్. తనకి అతని మీద ప్రేమ కలుగుతోందా? దీన్నసలు ప్రేమ అనొచ్చా? అవతలి వ్యక్తి ఆకర్షణ పెంచుకున్నంతలో తను కూడా వశం తప్పుతోందా? ఇది పర్వర్ట్ కాదు గదా?! తనెంతో స్ట్రాంగ్ అనుకుంది. కానీ ఇంత అల్పురాలా? నిగ్రహం తప్పగలదా? అతనలా మాట్లాడ్డం తనకి మొదట చీదరనిపించింది. కానీ రాను రాను ఏదో తమాషాగా వుంది. ఇక ఇప్పుడు ఏదో భయమే తప్ప కోపం రావడం లేదు. ఏంటా భయం? కేవలం నీతి తప్పుతానేమో అనే సందేహంతోనేనా?

అబ్బే..తనేదో భర్తకో, ఇతర కుటుంబ సభ్యులకో, సమాజానికో వెరవడం లేదు. నీతి అనేది వ్యక్తిగతమైందని గట్టిగా నమ్ముతుంది. తాను నమ్మినదాన్ని అక్షరాలా పాటిస్తుంది. ఒక వ్యక్తికి ఒక టైంలో ఒంటి కంటే ఎక్కువ సంబంధాలు వుండకూడదని మనసా వాచా నమ్ముతుంది. తను అడవిలో ఉన్నా సరే, నరమానవులెవ్వరూ తనను గమనించకపోయినా సరే మరో వ్యక్తితో సంబంధం పెట్టుకోలేదు. అందుకు తన మనసు బొత్తిగా అంగీకరించదు. కానీ...ఇప్పుడేంటో ఒణుకు పుడుతోంది. అతను అవ్యాజమైన అనురాగాన్ని కురిపిస్తోంటే... హత్తుకుపోవాలనుందంటూ మనసు లోతుల్లోంచి చెపుతోంటే తన మనసు అదుపు తప్పుతోంది. తనక్కూడా అలాంటి కుటిల బుద్ధులు పుడతాయేమోనని భయమేస్తోంది. ఈ స్నేహం వికటిస్తుందేమోనని తాను దారి తప్పుతుందేమోనని విపరీతమైన ఆందోళన కలుగుతోంది.

ఇతని ఫోన్ కాల్స్ ఎవాయిడ్ చేయడమెలా? సాయం చేశాడు కదాని లొంగిపోతుందా ఏంటి? అప్పుడు తన మీద తనకే అసహ్యమేస్తుంది. ఛ..ఛ..విషయం అంత దూరం వెళ్లదంటే వెళ్లదు. నిజమే.. కానీ శరీరం అప్పగించినంతలో సరిపోతుందా? మనసా, వాచా కర్మణా అన్నారు. తనకి ఊహలో సైతం చెడు తలపు రావడానికి వీల్లేదు. అతను తన చెంత చేరినట్లో, చుబుకం పట్టుకున్నట్లో లాంటి ఆలోచన కలిగినా తను నీతి తప్పినట్లే. అదెంతమాత్రం చాదస్తం కాదు. తన దృష్టిలో ఇదే మంచిది. ఉత్తమమైంది. వేరొకరు దీన్ని తప్పన్నా, ఒప్పన్నా తనకి తెల్సిన, తాను ఆమోదించిన సిద్ధాంతం మాత్రం ఇదే.

* * *

ఆరోజు ఆదివారం. పన్నెండుకల్లా వంట పూర్తయింది. లత భోజనం వడ్డిద్దామని భర్త కోసం

చూస్తే అతను బాల్కనీలో నిలబడి ఎదురింటి ఇల్లాలికి సైటు కొట్టడంలో లీనమై వున్నాడు. ఆవిడ బట్టలు ఆరేస్తోంటే కొంగు పక్కకి తొలగుతోంటే అవతల్నుంచి ఈ పురుషపుంగవుడు ఆబగా చూస్తున్నాడు. ఇదేం మొదటిసారి కాదు. పెళ్లయిన దగ్గర్నించి భర్త కొన్ని వందల సార్లు ఇరుగింటి, పొరుగింటి ఆడవాళ్లకేసి లొట్టలేస్తూ చూడ్డం లత దృష్టిని దాటిపోలేదు. ఆఖరికి బైక్ మీద పోతున్నప్పుడు తను వెనకాల కూర్చుందనే స్పృహ కూడా లేకుండా కంటికి నదరుగా కనిపించిన అమ్మాయి దాటి వెళ్లిపోతే, వెనక్కి తిరిగి మరీ చూస్తాడు. మొదట్లో పోట్లాడింది. కానీ కుక్క తోక వంకరన్నట్లు భర్త తత్త్వంలో మార్పు రాదని అర్థమయ్యాక ఇక వదిలేసింది. ఎదురుగా పొందికైన పెళ్లాన్నుంచుకొని పొరుగింటి పుల్ల కూరని కోరుకోవడం ఏమిటి? తను కూడా పక్క ఇంటి ప్రొఫెసర్ని అలా చూస్తే జీర్ణించు కోగలడా? అని తిట్టుకుంది. కానీ ఇంతలోనే 'ఛ... తోటి వారు తొడ కోసుకుంటే, తను మెడ కోసుకుంటుందా?అది తన నైజం కానే కాదు. ఇంకో వ్యక్తిని ఆ దృష్టితో చూడడమంటే ఎంగిలి కూటికి ఆశపడినంత వికారం కలిగి వాంతొచ్చినట్లవుతుంది. అదేంటో తనకలాంటివసలు మింగుడు పడని అంశాలు.

భోజనం పెట్టే లోపు రాజేష్ బాత్రూంకి వెళ్లాడు. ఈలోపు అతని మొబైల్ రింగైతే చూసింది. 'ఎం' కాలింగ్ అని వుంది. మామూలుగా అతనికొచ్చే కాల్సన్నీ ఎవరెవరి దగ్గర్నించి వస్తాయో లతకి తెలుసు. అందరివీ వారి పేరుతోనే వస్తాయి. వాళ్ల రెగ్యులర్ నెంబర్ మారితేనో, మరో నెంబర్ నించి మాట్లాడితేనో కేవలం నెంబర్ డిస్ప్లే అవుతుంది. కానీ ఇలా పొడి అక్షరంతో ఇదివర కెన్నడూ ఫీడ్ చేయలేదు. కానీ ఈ మధ్య తరచూ ఈ 'ఎం' నుంచి ఫోన్ వస్తోంది. చాలా సార్లే చూసింది గానీ, ఎన్నడూ పట్టించుకోలేదు, ఆరా అడగలేదు. కానీ ఇవాళెందుకో కొంచెం సందేహ మొచ్చింది.

రాజేష్ బయటకి రాగానే ''ఎం అంటే ఎవరు?'' అని అడిగింది.

రాజేష్ తడబడి ''ఆ... ఎం అంటే..మధు..నా ఫ్రెండ్'' అన్నాడు.

లత రెట్టించలేదు గానీ, అనుమానం బలపడింది. అక్కడ నిజంగా ఏం లేకపోతే రాజు వెంటనే ఆ మిస్డ్ కాల్కి డయల్ చేసి మాట్లాడేవాడే. కానీ గమ్మున వుండిపోయాడు. భోజనమయ్యాక రాజు పడగ్గదిలోకి వెళ్లగా, లత పుస్తకం చదువుకుంటూ హాల్లో కూర్చుండి పోయింది. కానీ చాలా అలసటగా అనిపించి కాసేపు పడుకుందామని లేచి బెడ్రూం వైపు నడిచింది. చేరవేసి వున్న తలుపు తోయబోతుంటే రాజు గుసగుసగా మాట్లాడ్డం వినిపించి ఆగిపోయింది. ''ప్లీజ్ మధూ, ఒక్క ముద్దు పెట్టవా?''అని బతిమాలుతున్నాడు.

లతకి ఒళ్లు జలదరించినట్లయింది. రోతగా, జుగుప్సగా అనిపించి లోపలకెళ్లి ఛడామడా తిడదామనుకుంది కానీ అక్కడ్నించి వెనుతిరిగి టెర్రస్ మీదకి వెళ్లింది.

తనేం లోటు చేసిందని మొగుడిలా పక్క దారులు తొక్కుతున్నాడు? తను బాగోదా? అంటే కోరి మరీ చేసుకున్నాడు. పెళ్లయిన కొత్తల్లో తన అందాన్ని తెగ పొగిడేవాడు. తిండి లోపం చేసిందా? ఎంత ఓపిక లేకపోయినా సరే కోరినవన్నీ చేసి పెడుతుంది. కట్నం పేరుతో కాకున్నా తన పేరున పెద్దవాళ్లు కొంత ఆస్తి రాసారు. ఇటు ఉద్యోగమూ వెలగబెడుతోంది. ఇవన్నీ వ్యర్థమేనా? మగవాడికి సంతృప్తి అనేది వుండదా? సొంత పెళ్లాంలో ఎన్ని క్వాలిటీస్ వున్నా పర స్త్రీ వ్యామోహం నశించదా? ఎందుకిలా? ఆలోచన్లు చిక్కుముడిలా తయారయ్యాయి. తల భారంగా అనిపించింది.

ముందు అనుకున్నట్లుగానే సాయంత్రం పుట్టింటికి వెళ్లింది. తమ్ముడి కూతురికి ఓణీలిస్తున్నారు. ఈ ముచ్చట గురించి విన్న దగ్గర్నుంచి 'ఏంటో సనాతన ఆచారాలు, చెత్త ఫంక్షను' అని లక్షసార్లు గొణుక్కుంది. కానీ ఇప్పుడు మటుకు ఇంత జీర్ణించుకోలేని విషయం తెలిశాక ఈ ప్రయాణం కొంత ఊరటనిచ్చింది. మదిలో జోరీగల్లా తిరుగుతోన్న ఆలోచనల్లకి కాస్త బ్రేక్ వేయగలిగింది.

అంతా చుట్టుముట్టి రాజు రాలేదేమని అడిగారు. తనకి ఆఫీసులో ఇన్స్పెక్షనుందని అబద్ధపు సాకు చెప్పింది. కాని లోపలెన్ని భయాలో? ఆ మధు ఎవరో తిన్నగా ఇంటి కొచ్చేస్తుందేమో! తర్వాత పరిస్థితేంటి? అంతకంటే ఊహించలేక కళ్లు మూసుకొని కణతలు నొక్కుకుంది.

కళ్లకడ్డంగా ఎడం చేయి పెట్టుకొని కళ్లు మూసుకు పడుకున్న లత దగ్గరకి 'ఆంటీ, నీ ఫోన్ మోగుతోంది' అంటూ వచ్చాడు మేనల్లుడు.

''థాంక్యూ'' మెకానికల్గా అని, ఫోనందుకుంది. ఇంకెవరు వాసూనే!

''హలో'' అంది తన గొంతు తనకే వినిపించనంత మెల్లగా...

''ఏంటి? ఎన్నిసార్లు చేసినా రెస్పాండవ్వవు? ఎక్కడున్నావు?''


''మా బ్రదర్ వాళ్లింటికొచ్చాను. చిన్న ఫంక్షనుంటేనూ''

''నీతో మాట్లాడకపోతే నాకు పిచ్చెక్కేలా వుంది లతా''

''అసలు మగవాళ్లంతా అంతేనా?'' ఉక్రోషంగా అంది లత. ఆమెకెందుకో భోరున ఏడ్వాలని పిస్తోంది. కొండంత ఓదార్పు కావాలనిపిస్తోంది. తనెంత నిగ్రహంగా వున్నా ఈ పెద్దమనిషి రెచ్చగొడుతున్నాడు. తనక్కూడా అతని పట్ల వాంఛ కలుగుతుందేమోనని భయపడి చచ్చేలా చేస్తున్నాడు. అవతల మొగుడేమో పరాయి ఆడవాళ్లంటే పడి ఛస్తున్నాడు. వాడికి వేరే ఆడవాళ్లు పెట్టే ముద్దులు, కౌగిలింతలూ కావాలి. ఎందుకిలా మగవాళ్లింత హీనంగా ఎందుకుంటారు? అని కోపమొస్తోంది. ఆవేశమొస్తోంది.

''నువ్వంటే నాకు నిజంగా చాలా ఇష్టం. కానీ ఆ సంగతి నీకు ఎప్పటికి అర్థమయ్యేనో..సరే, నిన్ను ఇబ్బంది పెట్టడం, తల్నొప్పి తెప్పించడం నాకు భావ్యం కాదు. నేను ఫోన్లు తగ్గించేస్తాను. కానీ, అస్సలు చేయకుండా మాత్రం వుండలేను'' అనేసి ఫోన్ పెట్టేశాడు.

లతకి తలంతా దిమ్ముగా అనిపించింది. కళ్లెమ్మట నీళ్లు కారుతున్నాయి. చాలా సేపు



రోదించాక కొంచెం సేదతీరినట్లయింది. ఈ మొగుళ్లనే జడపదార్థాలకి ఎన్ని అమర్చిపెట్టినా పెళ్లామంటే అభిమానం, గౌరవమూ వుండవా? ఆవిడకి కష్టం కలగకుండా చూడాలన్పించదా? తనెంత నిజాయితీగా వుందో అతనూ అలా వుండాల్సిన అవసరం లేదా? కేవలం తనే కాదు దాదాపుగా ఆడవాళ్లంతా నీతిగా, నిజాయితీగా వుంటారు. ఎక్కడో భర్త కళ్లు గప్పి మోసం చేసే స్త్రీలుండొచ్చుగానీ చాలా చాలా అరుదు.

నిజానికి ఇతర్లని తప్పు దృష్టితో చూడ్డమే తనకు నచ్చదు. అలాంటిది ఏకంగా సంబంధం పెట్టుకునే దశకి వెళ్లడమంటే జుగుప్సాకరంగా వుంది. అందుకే రాజుకి బుద్ధి చెప్పాలి. అందుకు వాసు అవకాశాన్ని ఎందుకు వినియోగించు కోకూడదు? అవును వాసుతో క్లోజ్‌గా మూవైతే సరే తన భర్తకి గుండె పగలడం అంటే ఏమిటో ప్రాక్టికల్‌గా అర్థమవుతుంది. క్లోజ్‌గా అంటే... కాంటాక్ట్ పెట్టుకోవచ్చా? ఛఛ... తనవల్ల కాదంటే కాదు. ఏమైంది అతను విజృంభించగా లేనిది తను మాత్రమే మడి కట్టుక్కూర్చోవాలా? తనకి మాత్రం పవిత్రతా? కోపం కొద్దీ కాసేపలా ఆలోచించింది. కానీ చాలా అశాంతిగా అనిపించింది.

రోజాకి ఫోన్ చేసింది. తిన్నగా ఈ టాపిక్ మాట్లాడాలనిపించలేదు. మామూలు విషయాలేవో సాగుతున్నాయి. కానీ మనసులో అలజడి ఊరికే వుంటుందా? కాసేపటికి తన విషయం కాదన్నట్లు ఎవరిమీదో మోపి ఈ ప్రస్తావన తెచ్చింది. చర్చ తీవ్రమైంది. రోజా చాలా సీరియస్‌గా... ''నువ్వెందుకింత అమ్మమ్మలా ఆలోచిస్తున్నావో నాకు అంతు పట్టడం లేదు. ఎప్పటికీ ఇలా చాదస్తప్పీనుగులాగే వుండిపోతావా? వెనకటికి నీలాంటివాడే తను వలచిందే రంభ, తను చెప్పిందే వేదం అన్నాట్ట. ఆ మూర్ఖత్వం నుంచి బయట పడవా? అసలు పవిత్రతలాంటి మాటలంటేనే నాకు అసహ్యం. ఈ ప్రపంచంలో ఏది శుద్ధిగా వుందో కాస్త చెప్పు? నీటిని చేపలు ఎంగిలి చేశాయని తాగడం మానేస్తామా? పూలని తుమ్మెదలు గ్రోలాయని చీదరించుకుంటామా? ప్రేమ అనేది చాలా సహజాతి సహజమైన ఇన్‌స్టింక్ట్. అది ఎప్పుడు ఎవరిమీదైనా కలగొచ్చు. పూవు వికసించినట్లు, గాలి వీచినట్లు అది ఎప్పుడో కలుగుతుంది. దాన్ని ఆపడానికి నువ్వెవరు? ఏదో స్థలాలకి ఫెన్సింగ్ వేసినట్లు మనసులక్కూడా వేసుకుంటామా'' అంటూ దులపరించి పారేసింది.

రోజాతో ఎంత మామూలుగా చర్చించినా అవి లతని ఎంతమాత్రం కన్విన్స్ చేయలేకపోయాయి. ఏదైనా సరే మంచి మార్పయితే తానూ అంగీకరిస్తుంది. అనుసరిస్తుంది. తానేం మొగుడు ఎలాంటివాడైనా చచ్చినట్లు సర్దుకుపోవాలనదు. ఒకవేళ ఆ బంధం తెగిపోతేనో, వికటిస్తేనో ఇక చాదస్తంగా అలాగే వుండిపోవాలనదు. కానీ, ఇల్లీగల్ కాంటాక్ట్స్ అంటేనే తనకి ఏవగింపు. 'అదేంటి? ఏదో వ్యాపారం చేసినట్లు అన్నీ చూసుకొని ప్రేమ కలుగుతుందా?' అంటే తనకి వితండవాదం కింద, జుగుప్సాకరమైన చర్చ కింద తోస్తుంది. ఆఫ్టరాల్ నాలుగు రాళ్లు సంపాదించ డానికి చేసే వ్యాపారమే అన్నీ సరిచూసుకుని కాని దిగమే! అలాంటిది మనసుకి సంబంధించిన, అందునా రెండు కుటుంబాలతో, పుడితే చిన్నారుల తోనూ సంబంధమున్న ప్రేమ విషయంలో ఆచితూచి అడుగేయనవసరం లేదా? తాజ్‌మహల్ని చూస్తే చాలా మందికి ముచ్చట కలుగుతుంది. అలాని అందులో చేరి బిచాణా వేస్తారా? పెళ్లయిన వ్యక్తి మనోహరంగా వున్నంత మాత్రాన మోహంలో పడిపోవడమేనా?

గొప్పగా వాదించేస్తున్నామనుకొని స్థలాలకు మల్లే ఫెన్సింగ్ వేసుకుంటారా? అంటే సరి పోయిందా? స్థలాలు హద్దులు దాటినా ఫర్లేదు. దురాక్రమణలు చేసినా ఫర్లేదు. కానీ ఒక మనసుని ఇద్దరు పంచుకోవడం కంటే హేయమైంది ఇంకోటుందా? చచ్చినట్లు ఫెన్సింగ్ వేసుకోవలసిన అవసరం లేదూ...?

❑

